

# కొలిమి

కొలకలూరి ఇనాక్

పొగ కమ్మింది. ఊరంతా తూర్పు నుంచి పడమటికి తోలే గాలికి. అంత పొగ కంటబడితే ఊళ్లో ఎక్కడో ఏదో తగలబడుతూ ఉందని జనం భయపడాలి అనేమీ లేదు. అందరికీ అలవాటు ఆ పొగ.

నిప్పుంది. మంట లేదు, పొగ ఉంది. అది ఆటి కాలుతూ ఉంది. ఎండు వరిగడ్డి నేల మీద పరచి, దాని మీద రైసు మిల్లు ఊక పోసి, ఆ పైన గాను పెట్టి, మళ్లీ ఊక పోసి, ఊక కనబడకుండా రాకాసి బొగ్గు, పిడకలు పేర్చి, అంత కిరసనాయిలు చుట్టూ పోసి, అగ్గిపుల్లగీసి అంటిస్తే, పుట్టిన మంట చుట్టూ తిరిగి, బొగ్గు పిడక ల్లోంచి, ఊకలోంచి, గడ్డిలోకి పాకి, అన్నీ అంటుకొని క్షణకాలం మండి, ఆ పైన రాజుకొంటూ పొగలెల్లుతూ ఉన్నాయి, రెండు గాన్లూ.

గాలి తోలితే కాలే ఊక, ఇకిలించే కోతి పళ్ల చిగుళ్లలాగా ఎర్రగా ఉంది. గడ్డి, ఊక, పిడకలు పూర్తిగా కాలి, చిరుమంటలు పుట్టించి, వేడి కలిగించి, లోప లున్న ఇనపగానును ఎర్రగా మండించినాక పిడకలు ఆరిపోతూ ఉన్నప్పుడు పని ప్రారంభమవుతుంది. ఊకంతా పూర్తిగా అంటుకొంటే గాని పిడకలు అంటు కోవు.

రగులుతున్న నిప్పు వలయం చూస్తూ నిలబడ్డ లింగాలు, నిట్టూర్పు విడిచాడు. అతడిది కొలిమి పని. వంశపారంపర్యంగా అదే పని చేస్తున్నాడు. కమ్మరం అతడి కులవృత్తి. చెక్కపని కాని, ఇనుపపని గాని, పల్లెలో ఏం చేయవలసి వచ్చినా లింగాలే దిక్కు. గడ్డి రిసేటప్పుడు గునపాలతో, చదును పదును చేసే టప్పుడు పారతో, పగలకొట్టేటప్పుడు గొడ్డళ్లతో, విరగ దీసేటప్పుడు పికాసీలతో, పొడిచేటప్పుడు, బాకులు, బరిసెలు, ఈటెలతో, కోసేటప్పుడు కత్తులు, కొడవళ్లతో కలుపు తీసేటప్పుడు లిక్కులతో, దున్నేటప్పుడు కొర్రులతో పని పడి, మొద్దుబారి పోయినవాటిని, కోపుగా, పల్చగా సన్నగా నిటారుగా పనికొచ్చేటట్లు సాగ్గొట్టాలన్నా కోసుగా చేయాలన్నా రైతులకు లింగాలు అవసరమే. కొలిమి కావలసిందే!

రెండెడ్లు లాగే బళ్లను తయారుచేయటంలో లింగాలు పేరు ప్రఖ్యాతులున్న పనిమంతుడు. చుట్టుపక్కల గ్రామాల్లో కూడా ఇంతటి పనివాడు లేడు. ఏం పని వచ్చినా వాళ్లంతా ఈడకే వచ్చి పని చేయించు కొని పోతారు.

లింగాలు కిద్దరు సన్నాసులున్నారు. నిజంగా సన్నాసులు కారు. లింగాలు వాళ్లను పెద్ద సన్నాసి, చిన్న సన్నాసి అని పిలుస్తాడు. జనం మాత్రం వాళ్లను కుడి భుజం, ఎడమ భుజం అని పిలుస్తారు. వాళ్ల పేర్లు ఎవరికీ తెలియదు. బాల్యంలో రైలుపట్టాల వెంట వస్తున్న వాళ్లను లింగాలు ఆపి, అన్నం పెట్టి, పనిచెబితే చేస్తూ, వాళ్లు అక్కడే ఉండిపోయారు. సాధారణంగా ఎడం భుజం తిత్తూత్తాడు. కుడిభుజం పనిముట్లు అందిస్తాడు.

లింగాలు ఉదయమే లేచి. కాలకృత్యాలు తీర్చుకొని, కొలిమి షెడ్డులోకి వస్తాడు. నాలుగు ఇనప కమ్మీల మీద ఉన్న రేకు కప్పే కొలిమి షెడ్డు. కొలిమికి పూజ చేసి దండం పెట్టి అగరు బత్తీ వెలిగించి, ఆ పైన కొలిమి పొయ్యిలో బొగ్గులు వేసి రాత్రి నిప్పు రాజు కొనేట్టు చేస్తాడు.

నిన్న మధ్యాహ్నం నాంచారయ్య తెచ్చి ఇచ్చిన ఇనుపబద్దీలను రెండింటినీ గుండ్రంగా వంచి, ఒక బద్దీ రెండు కొనల్ని ఒక్క చోటికి తెచ్చి కింద పెడితే, కొనలు రెండూ ఎదురెదురుగా కూర్చుని అతుక్కుందాం అని మొగుడూపెళ్లాలై ముచ్చట్లు చెప్పుకొన్నాయి.

నిన్న కొలిమిలో కాల్చి బద్దీ రెండు కొనల్ని అతికించాడు. అతుకు ఎక్కడో తెలియనంత అందంగా అతికించాడు. బద్దీలు గాన్లు అయ్యాయి. అవి ఈ ఉదయం కాలుతున్నాయి.

లింగాలు సమ్మెటతో చరిచి సాగ్గొట్టినా, సుత్తెతో మొత్తి ముద్దచేసినా పట్కారుతో పట్టి రంధ్రమేసినా చూడముచ్చటగా ఉంటుంది. పసిపాపల బుగ్గల్లాగా ఇనపముద్దలు లాగితే సాగుతాయి వదిలేస్తే అతుక్కుంటాయి. ఎంత మాలావు ఇనుమైనా లింగాలు చెప్పినట్లు వింటుంది. ఉండమన్నట్లు ఉంటుంది. సాగు అంటే సాగి, అతుక్కో అంటే అతుక్కొని, కాలు అంటే కాలి, మండు అంటే మండి, మాట చెబితే పనిచేసే మాలిమైన కోతిలాగా ఇనుం, లింగాలు కొలిమిలో, ఆటలాడి సొమ్ము వసూలుచేసి పెడుతుంది.

తన వంశంలో పూర్వీకులు కమ్మరం చేసి బాగానే బ్రతికారు. తినా కుడవా కొదవ లేకుండా ఉన్నారు. ఇప్పుడు ఏరోజు కారోజు ఎదురుచూడవలసి వస్తూ ఉంది.

భార్య గతించటంలో కూతురు చదువు మాని వంట చేసిపెట్టే పరిస్థితిలోకి దిగజారిపోయింది. పెళ్లి చేయలేదు. పట్టణంలో చదువుకొంటున్న కొడుకు డబ్బు కావాలని పదేపదే గుర్తుచేస్తున్నాడు. పిల్ల సన్నాసులిద్దరూ పెద్ద సన్నాసులై తిండి యావవాళ్లు అయ్యారు. వాళ్లకు ముప్పూటలా కడుపు నిండా తిండి పెట్టగలిగే వెసులుబాటు కూడా లేకుండాపోయింది. వాళ్లు వెళ్లిపోతే తన కాళ్లూ చేతులు ఆడవు.

రైలు కట్ట కివతల లింగాలు మిద్దెకవతల మెల్లాలో కాలుతున్న గాన్లు పొగ తగ్గి సెగ పెరిగి పదును కొచ్చినట్లు అనిపిస్తే చూచివచ్చిన లింగాలు, మంటలు దాటి, మిద్దె దాటి కొలిమి షెడ్డులోకి వచ్చి కూర్చుని 'ఇంకా ఉండాల్రా' అని ఇరు భుజాలకు చెప్పి, స్టూలు మీద పై టవలు వేసుకొని కూర్చున్నాడు.

ఇంట్లో కొంచెం బియ్యమే ఉంటే ఎసట్లో వేశానని, పచ్చడి మెతుకులేనని కూతురు ప్రకటించిపోయింది. అదే భాగ్యం అనుకొన్నాడు లింగాలు. ఉసూరుమంటూ కూర్చున్నారు ఇరు భుజాలు.

మెట్టుపంటలు, వానలు సరిగాలేవు, పంటలు రావు. రైతు పరిస్థితి సంకటంగా మారింది. వానుంటే, పంటుంటే, రైతు బాగుంటే లింగాలు సుఖపురుషుడే! ఇప్పుడు దుఃఖపురుషుడయ్యాడు.

నాంచారయ్య తెచ్చిన మొద్దులు ఆకులు కోయించి, రెక్కలు మలిచి, కుండలు చేసి, ఇనప ఇరుసు తిరిగే రంధ్రం చేసి, కుండను ఆకులు కూర్చునే కన్నాలు తొలిచి, రెక్కలకు ఆకులు దిగే రంధ్రాలు వేసి, కుండలో ఆకులు దించి, రెక్కలు తొడిగితే బిర్రుగా చక్రం బందోబస్తుగా కూర్చుంది. అంత పకడ్బందీగా చక్రం చేయటం లింగాలుకు మాత్రమే తెలుసు. మరి మరి సరిదే పని లేకుండా, చివ్వకుండా, చిత్రిక పట్టకుండా, తోపుడు పట్టకుండా, అణగ్గొట్టకుండా, వంగకుండా వంపు తీయకుండా, చేసి ఆకులు రెక్కలు అలా అతికించినట్లు చేయటం అందరికీ చేతకాదు. అందుకే లింగాలుకు అంత గిరాకీ! ఇనపకమ్మి తొడక్కుండా దొర్లిస్తే దొర్లిపోయేట్టు ఉన్నాయి చక్రాలు.

అప్పటికే పోలుగర్ర మీద వేసే కాడి తయారయి ఉంది. కాడికి పట్టెడ వేసే కన్నాలు ఎంత నున్నగా ఉన్నాయంటే వెన్న పూసినట్లు మెత్తగా ఏ మాత్రం గరుకు లేకుండా వున్నాయి.

పోలుగర్ర వెన్ను మీద బద్దెలు, బద్దెల కింద పట్టీలు బలంగా ఉన్నాయి. ఇనపిరుసు మీద కూర్చున్న చెక్క చదరపు మొద్దు పటిష్ఠంగా నిలువుపలకలు, అడ్డం పలకలతో సిద్ధంగా ఉన్న పోలుగర్రకు చక్రాలు తొడిగితే, చక్రాలకు ఇనపబద్దీ వలయాలు బిగిస్తే చక్రాలు సిద్ధం. బండి రెడీ!

బండి పరిస్థితి చూసుకోవటానికి నాంచారయ్య వచ్చాడు. లింగాలు డబ్బు అడిగితే ఆసామి వచ్చాడు. నవ్వు కథ అతడికి అర్థం కాలేదు.

బండి చెక్కపని ఇనప్పని చేసినందుకు కూలీ రెండు వేలు, సామానంతా ఆసామిదే. చేతాళం మాత్రమే రెండు వేలు. పని మొదలుపెడుతూనే లింగాలు డబ్బు అడిగాడు. 'యాడ బోద్ది?' అన్నాడు నాంచారయ్య. కుండపనిలో పలకపనిలో చెక్కపనిలో పదిరోజులుగా లింగాలు అడుగుతూనే ఉన్నాడు. నాంచారయ్య మాట తప్పకుండా 'యాడబోద్ది' అంటూనే ఉన్నాడు. లింగాలు నోరు విడిచి కూటికి, జరగటం లేదన్నాడు. నాంచారయ్య పిచ్చినవ్వు వెలికిగా నవ్వాడు.

"మాపిటేలకి బండి పని అయిపోద్దా," అన్నాడు నాంచారయ్య. తల వూపాడు లింగాలు.

"తీసుకుపోవొచ్చా?" అంటే, "అరనిచ్చి రేప్పొద్దున్నే బండి కట్టుకోవచ్చు," అన్నాడు లింగాలు.

నాంచారయ్య డొంకలో పోతుంటే కంచె కివతల దొడ్డిక్కూర్చుంటున్న కుడిభుజం చూశాడు.

నాంచారయ్య నల్ల చింతయ్య మాటల్లో కొత్త బండి ప్రస్తావన వచ్చి, "డబ్బెట్టా సర్దుబాటు జేత్తా?" అని అడిగితే, "డబ్బుకు ఇరకాటంగానే ఉంటది," అన్నాడు.

"డబ్బీయందే బండీయడేమో లింగాలు," అంటే, "మంచి మాటల్జెప్పి బండి దొడ్డికి దెచ్చి సావిట్లో ఇడిస్తే మల్లీ మాట మల్లీ. చెయ్యాడినప్పుడు సర్దుబాటు చెయ్యొచ్చు," అన్నాడు.

"మాసూలప్పుడు పనిముట్లు కక్కుకొట్టిచ్చిన సామ్మీయలేదుగా లింగాలుకి?"

"ఇయ్యలే."

"ఎగరగొట్టినట్టేగా?"

"ఇప్పటికింతే! ఉన్నప్పటి మాట సూద్దాం. మనదురుష్టం, ఆడి పున్నెం."

"మాపిటేల ఆడు బండీడేమో!"

"ఇయ్యక ఊళ్లో ఉంటాడా?"

నాంచారయ్య, నల్ల చింతయ్య అటుబోగానే గుండె భగ్గుమన్న కుడిభుజం పరు గెత్తుకొని వచ్చి, ప్రతి మాట పూసగుచ్చినట్లు చెప్పాడు లింగాలుతో. ఆ మాటలు వింటుంటే లింగాలుకు ఆకలి అయినట్లుగా అనిపించింది. 'ఊళ్లో ఉంటాడా?' అన్న మాటకి కడుపు తరుక్కుపోయింది.

"కొత్త బండి శాయమేకులు యాడుండా యిరి," అంటే, "ఇద్దుగో ఈడుండాయి," అంటూ ముందు కురికాడు ఎడం భుజం, శాయ మేకులు గలగలలాడించుకొంటూ.

"ఆటిని మిద్దె గూట్లో బెట్టండ్రా," అన్నాడు. "నోరుముయ్యండి," అన్నాడు. "నోరెత్తితే?" అన్నాడో లేదో, "కాలెత్తుతావ్," అన్నారు భుజాలు.

అంత ఆకలితో ఉన్న లింగాలు ఫక్కున నవ్వాడు.

వాళ్లు శాయమేకులు మిద్దెలో గూట్లో దాచి వచ్చారు.

చక్రాలు దొర్లేటప్పుడు, కుండలు ఇరుసు నుంచి జారి చక్రాలు పడకుండా, ఇరుసు రంధ్రంలో ఇరుక్కొని చక్రం కుండను ఆపి పట్టుకొనేవి శాయ మేకులు.

"తింటానికి రండి," అంది కూతురు.

ఇరుభుజాలు వెంటరాగా మిద్దెలోకి పోయాడు లింగాలు.

ఒక కునుకు తీసి లేవంగానే చక్రాలకు గాన్లు బిగిద్దామని చెప్పి, పిడకలు బూడిదై, బొగ్గులు నివురు గప్పుతున్నప్పుడు తనను లేపమని భుజాలతో చెప్పి, టవలు విదిలించి నాపరాయి మీద పరుచుకొన్నాడు లింగాలు.

పొద్దు ఏటవాలుతూ ఉంది.

కణకణ కాలుతున్న బొగ్గుల మీద పిడకలు నుసై రాలిపడుతున్నాయి.

గాన్లు ఎర్రడాలు తిరిగాయి.

లింగాలు గురక ఆగిపోయింది.

ఇరు భుజాలు, ఇరు భుజాలూ కదిపితే లింగాలు లేచి కూర్చున్నాడు.

"లింగాలు గాన్లేత్తన్నాడు," అనగానే ఎక్కళ్లేని పిల్లలు అక్కడ చేరారు.

పిడకల బూడిద పక్కకు తొలిగించి, ముగ్గురూ మూడు పక్కల గాన్ను పట్టుకార్లతో పట్టుకొని తెచ్చి, నేలమీద పెట్టి చక్రాన్ని దానిలో కూర్చోబెట్టారు. మిగులుతూ ఉన్న చక్రం చెక్క చురచురమంటూ ఉండగా పట్టని చోట సుత్తెతో కొడుతూ ఎక్కించి మంట ఆర్పి, చక్రం చెక్కల చుట్టూ గాను బిర్రుగా ఎక్కించి, తృప్తిగా గాలి పీల్చుకొన్నాడు లింగాలు. ఇసుక జల్లారు. మంట మాయం.

ఎర్రటి గాను, రాగిరంగును, నల్లరంగును, అసలు ఇనుంరంగును పొందిందాకా గాలిలో ఆరనిచ్చారు. ఆరిన గాను బిర్రుగా మారి లక్కలా అతుక్కుపోయింది.

రెండు చక్రాలు సిద్ధమయ్యాక, "పోయి రండిరా సన్నాసుల్లారా," అన్నాడు లింగాలు.

ఇరు భుజాలు చెరొక చక్రం దొర్లించుకొంటూ పోయారు. వాళ్ల వెనుక పిల్లలు పొలోమంటూ పరుగులు తీశారు. అరుపులు, కేకలు, పిల్లల ఆనందం చూసి లింగాలు పొంగిపోయాడు.

ఒక కళాస్రష్ట తన పని జనం ఉపయోగంలోకి వచ్చినప్పుడు పొందే ఆనందం, పరుగులు తీసే పిల్లల్ని, దొర్లే చక్రాల్ని చూస్తూ పొందుతున్నారు లింగాలు.

అల్లంత దూరం దొర్లించుకుపోయిన కుడి, ఎడమ భుజాలు తిరిగి దొర్లించుకు వస్తుంటే 'మేవు?' అంటూ చిన్న పిల్లలూ బతిమాలుతుంటే పెద్దపిల్లల్ని దొర్లించటానికీ, చిన్న పిల్లలు దాన్ని తాకటానికి అనుమతి ఇచ్చిన భుజాలు, చక్రాలు ఎక్కడా పడిపోకుండా తిరిగి దొర్లింపిచ్చి తీసుకొని వచ్చారు.

ఇరుసూ, పట్టెలూ బిగించి ఉన్న పోలు గర్ర ఒక పక్క, సిద్ధంగా ఉన్న గాన్లు తొడిగిన చక్రాలు ఇంకో పక్క నేలమీద పడుకొని ఉన్నాయి. గాన్లు కాల్చిన పిడకలు బొగ్గులు బూడిదై బిడ్డల శూలనొప్పికి బొడ్డు చుట్టూ గుండ్రంగా కాల్చినట్లు, నేల కడుపునొప్పికి బొడ్డు రెండు పక్కలా వృత్తాకారంగా కాల్చినట్టు, బూడిద వలయాలు మిగిలి, ఆరి గాలిలోకి లేస్తూ సంచలనంగా ఉన్నాయి. పుణ్యాత్ముల మహాత్ముల అస్థికలు అన్ని నదుల్లో భారతదేశమంతా చల్లినట్లు, కలిపినట్లు, ఈ బూడిద లేచి, ఊరంతా పాకి పొలాలకు వాయు ప్రవాహంగా విస్తరించింది. ఈ పూజ ఫలించి రేపు పొలాలు బాగా పండితే రైతులు కళకళలాడుతుంటారు. తన బిడ్డలు దేశదేశాలకు విస్తరిస్తుంటే ఆనందించే దేశంలా, తన సాహిత్యం ప్రపంచం అంతా విస్తరిస్తే సంతోషించే సాహిత్యస్రష్టలా, తన గానం వాయుతరంగాలలో శాశ్వతమైన శబ్దబ్రహ్మగా మిగిలిపోతే తరించే సుస్వర స్రష్టలా, లింగాలు గాలిలో లేచిపోతున్న బూడిదను చూసి పట్టరాని పరమానందంతో పులకించి పోతున్నాడు. స్థిరంగా సిద్ధమైన బండి ఉండగా, చరమైన బూడిద మీద లింగాలుకు మమకారం వుండటం ఆశ్చర్యంగా ఉంటుంది.

లింగాలు టెంకాయ కొట్టాడు. కర్పూరం వెలిగించాడు. హారతి పట్టాడు. పప్పు బెల్లాలు పిల్లలకు పెట్టాడు. పరిమళ ప్రపంచం ప్రవహించిపోతూ ఉంది.

పిల్లలూ, పెద్దలూ, అందరూ కలిసి పోలుగర్ర ఒకపక్క ఇరుసుచక్రంలోకి ఎక్కించారు. ఇరువైపుల ఇరుసులు చక్రాల కుండల్లో కూర్చున్నాక శాయ మేకులు పెట్టాలి. పెట్ట లేదు. శాయ మేకులు ఇంట్లో గూల్లో ఉన్నాయి. చక్రాలు ఊడి పడకుండా చెక్క ముక్కలు ఇరుసు రంధ్రాల్లో రెండు పక్కలా ఇరికించారు. చక్రాలు బెడిసి తప్పవు. బండి సిద్ధమయింది. శాయమేకులు పెడితే బండి తోలుకుపోవచ్చు. లేకపోతే సిద్ధమైన బండి కూడా తీసుకుపోయే వీలులేదు. బండికి దండం పెట్టి దిష్టి తీశాడు లింగాలు.

నాంచారయ్య జోడెడ్లు తోలుకు వచ్చాడు. బండి కట్టుకుపోవాలనే అతడి ఆలోచన, వస్తూనే "ఆఁ అయిందా?" అన్నాడు "ఊఁ!" అంటూ తలవూపాడు లింగాలు.

కాడికి పట్టేళ్లు వేసి ఎడ్లు పూన్చటానికి దూకుడు మీద ఉన్నాడు బండి సొంతదారు.

"ముగ్గురికి రెండోరాల కూలి. రొండేలు తెచ్చేవా?" అన్నాడు లింగాలు.

"యాడికిబోద్ది డబ్బేడికి పోద్ది?" అంటూ రాగాలాపన ప్రారంభించాడు నాంచారయ్య.

"పని మునుం బెట్టిన కాణ్ణుంచి ఇదే ముక్క అంటున్నావే. మేవు యేం దిన్నావో, యేం దిన్లేదో నీకు తెలియదు. కరువు కాలం. కష్టకాలం, నాకు గడవాలి గందా," అన్నాడు లింగాలు.

"డబ్బేడికి బోద్ది? ఇయ్యాల గాపోతే రేపు! లేదంటానా? కాదంటానా?"

"అనవులే! నా ఆకలిని ఏమనమంటా? నాకు రెక్కల కట్టవే! పొలముందా పంటుందా?"

"ఆఁ మాకూ ఉండాయి. పొలాలు ఉంటానికి, యేం లాబం? పండేడిసినియ్యా? తినేడిసినావా?"

"ఇయ్యేటి కాకపోతే వచ్చే యేటికి పొలం పండకపోద్దా? నువ్వు బతక్కపోతావా? నాకేందుంది శ్రాద్ధం? ఈ పన్జేత్తే కూడు! లేకుంటే దుమ్ము."

"అందరి బతుకులూ అట్టాగే యేడిసినై లింగాలు. యేం పొలాలో, యేం బతుకులో, యీ పొలాలేడ పండి సచ్చినై, యేడ తిని సచ్చినం."

"యేందో లెద్దూ! యంత సెట్టుకంత గాలి. నా చేతాళం నాకిస్తే బండి తోలుకు పోవొచ్చు."

"యియ్యకపోతే!"

"బండియ్యను!"

"నువ్విచ్చేదేంది? నేనే తోలుకుపోతా. యవుడడ్డమొత్తాడో జూత్తా."

"నేనే! యట్టా దోలుకుపోతావో నేనూ జూత్తా!"

"సరేనా? కాసుకో."

"సరే! రా తేల్చుకొందాం."

ఈ స్థితి వచ్చిందాకా వింటూ ఉన్న జనం అడ్డం పడి కమ్మరి కూలి కమ్మరికిచ్చి బండి తోలుకుపోయేదే న్యాయమని నాంచారయ్యతో చెప్పారు.

రైతులు ఆపదలో ఉన్నారు. ఇవాళ కాకపోతే రేపు ఇస్తారు. అంత పట్టూవిడుపూ లేకుండా పోతే ఎట్లా? అని లింగాలుతో చెప్పారు.

"శాయ మేకుల్లేక తోలుకు పోలేననుకొంటున్నావో ఏమో, బండి తోలుకుపోగల్ను."

"అయి ఉంటే కూడా తోలుకు పోగలనను కొంటున్నావేవో బండి? నీ వల్లగాదు!"

మాటా మాటా పెరుగుతూ ఉందని గ్రహించిన జనం, నాంచారయ్యను దూరంగా తీసుకుపోయారు. అక్కణ్ణుంచీ ఆరుస్తున్నాడు నాంచారయ్య. "రేప్పొద్దున్నే వత్తా, శాయమేకులు చేసుంచు. బండి దోలుకుపోతా."

"డబ్బు తేకపోతే, శాయమేకులు గూట్లో ఉన్నాటిని నీకిచ్చినా బండి తీసుకుపోలేవు."

"డబ్బు తేను!"

"బండియ్యను."

"యట్లా యియ్యవో నేను జూత్తా."

"యట్లా దీసుకుపోతావో నేనూ జూత్తా."

"గూట్లో ఉంటే తియ్యి, చెయ్యకపోతే చెయ్యి. రెండు ఇనుపముక్కలు మేకులుగా సరిసిచ్చేది నీకెంత? పనివాడు పనివాడే. నువ్వు బలహీనుడివి. వాడిది పెద్ద బలగం. నువ్వు ఒంటిగాడివి. వాడు ఆగం జేత్తే నీ బతుకెంత? నువ్వంటే ఇష్టమే, అయినా మేమెవరవూ నీకు అండగా నిలవలేం," అని లింగాలుకీ, "ఆడు పన్జేసేడు. ఆడి కూలి ఆడికి బారెయ్. ఆడు అలగావోడు. నువ్వు రైతువి. ఆడినోట్లో నువ్వు నోరుబెడితే సెడదా? నా మాటిని ఆడికి కూలిత్తావో, మాట వొప్పిత్తావో తేలుసుకో. నాలుక్కాలాలు ఉండాలిసిన బండి మంచిగా తీసుకుపో. తగాదాతో కాదు. శుభమంటూ తీసుకుపోతా అశుభం అంటగంటుకొంటావా?" అని నాంచారయ్యకూ జనం చెప్పారు.

నాంచారయ్య ఎడ్లు దోలుకొని ఇంటికి వెళ్ళిపోయాడు. జనం తలోదిక్కుకూ సాగిపోయారు.

కొత్త బండి మీద లింగాలు. ఇరు భుజాలు కూర్చున్నారు.

"కూల్డబ్బు ఇయ్యకుండా బండి బలవంతంగా దోలుకుపోతే యేంజెయ్యాలి? యెవురికి జెప్పాలి? యెవురుకు జెబితే పొట్టనిండుద్ది?" కుడి భుజాన్ని, ఎడం భుజాన్ని గుచ్చిగుచ్చి అడిగాడు లింగాలు.

వాళ్లు ఏమీ మాట్లాడలేదు.

పొద్దు కుంకింది.

ఆలోచిస్తూ బండిమీదే పడుకొన్నాడు లింగాలు.

"నేను మీకు కడుపునిండా కూడు పెట్టలేని చాతగాని తండ్రిని. జీతం నాతం లేని బ్రతుకు మీది. నన్నొదిలి మీరు, మీరు పోగలరా? పోవాల్రా!"

వాళ్లేం మాట్లాడలేదు.

"యంత లేదన్న ఇరవయ్యేలు వత్తై దీన్ని అమ్మితే. గూట్లో శాయమేకులు తెచ్చుకొని, కాడి మెళ్ల మీదేసుకొని లాక్కుపోయి యాడన్నా అమ్ముకొని మీ బతుకులు మీరు బతుక్కొంటారా? నాంచారయ్యకు దొంగలు దోచుకొన్నారని సెబుతా."

వాళ్లెటు జూస్తున్నారో చీకట్లో కనిపించటం లేదు. ఏమీ బదులాడలేదు.

"వద్దులెండిరా. ఎక్కడున్నా మిమ్మల్ని పట్టుకొచ్చి సావగొడతారు."

రాత్రి అన్నం వండలేదు. వాళ్లేమి తినలేదు. బండి మీదే వెల్లికిలా పడి ఉన్నారు. అమావాస్య చీకటి. కన్ను పొడుచుకొన్నా ఏమీ కానరాని రాత్రి.

కష్టజీవికి కడుపునిండా తిండిలేకపోతే ఎట్లా? శ్రమించినవాళ్లు కూడుదినొద్దా? శ్రమకు విలువలేదా?

ఆకలి ఎంత దుర్మార్గంగానో ఉంటుంది. ఏమయినా చేయిస్తుంది. చావటాలు, చంపుకోవటాలు మూలం ఆకలే కదా!

ఆకలి మానవసంబంధాలను ఎంత హీనం కావిస్తుందో కదా! అన్నదమ్ముల్లా పలకరించుకోవలసిన రైతు, కమ్మరి శత్రువుల్లా మాట్లాడుకోవటం వెనుక దాగి ఉన్న రహస్యం ఆకలే కదా!

ఎవరికి అర్థమవుతుంది?

అర్థరాత్రి దాకా అక్కణ్ణుంచి లేవని సన్నాసుల్ని అడిగాడు లింగాలు, "గడ్డి వుందా?" "ఉంది," ఇరు భుజాలు చెప్పారు.

"నాంచారయ్య తెచ్చిన కిరసనాయిలు ఇంకెంతుంది?"

"రెండు సీసాలు!"

"గడ్డి తెచ్చి బండిమీద వేసి కిరసనాయిలు బండి మీద చల్లండి." వాళ్లు సంకోచించారు.

లింగాలు గదమాయించారు. "కానీండి!"

ఎండు వరిగడ్డి తెచ్చి బండిని కప్పేశారు. పిడకలు మిగిలి ఉంటే వాటిమీద పరిచారు. కిరస నాయిలు చిలకరించారు.

"అగ్గిపెట్టె ఏది?"

"ఇంట్లో! గూట్లో!"

"తెండి! ఉండండి! నేనే తెస్తా! ఈడే ఉండండి. ఎవణ్ణీ రానీయొద్దు. నేనే వస్తా," మిద్దెలోకి పోయాడు లింగాలు.

తెల్లారుజామున లోనికి పోయిన లింగాలు, తెల్లగా తెల్లారిన తరువాత బండి దగ్గరకు వచ్చాడు. చేతిలో అగ్గిపెట్టె లేదు. శాయమేకులున్నాయి.

ఎడ్లు తోలుకొని, హారతి పళ్లెం జీతగాడు తేగా, నాంచారయ్య వచ్చాడు, కరకర పొద్దెక్కుతున్నప్పుడు.

వచ్చీ రావటంతోనే, లింగాలు చేతులు పట్టుకుని, "డబ్బు సర్దుబాటు కాక తప్పుగా మాట్లాడాను. ఏమీ అనుకోవద్దు లింగాలు," అన్నాడు.

“ఆకలి, అర్ధాకలి. వారంరోజులుగా కూడు సరిగా లేదు. రాత్రి మేముగ్గురం ఏమీ తినలేదు. ఆకలి. ఏదో అనరాని మాటలు అన్నాను. ఏమీ అనుకోవద్దు,” అన్నాడు లింగాలు.

“రాత్రి ఊరంతా తిరిగి అందరినీ అడిగి నానా అగచాట్లు పడ్డాను,” నాంచారయ్య చెప్పాడు.

“పోనీలే ఎవరి కర్మకు ఎవరు కర్తలు? మా అదురుష్టం ఇది. మా ఆకలి ఇంతే! వీలయినంత తొందరగా మా ఆకలి తీర్చండి. సావకుండా సూడండి,” అంటూ శాయ మేకులు బండికి పెట్టి, “బండి కట్టుకు పొండి,” అన్నాడు.

“లేదు లింగాలు. డబ్బు సంతన జేసుకొచ్చా,” అని డబ్బు, బియ్యం, ఆకు వక్క ఉన్న హారతి పళ్లెం లింగాలు చేతుల్లో పెట్టాడు.

లింగాలు కళ్లలో నీళ్లు తిరిగాయి.

ఆ నీళ్లు ఏడుపువి కావు. ఆకలి తీరుతుందన్న సంతోషానివీ కావు. మనిషి మీద మనిషికి చావని మమకారానివి.

కూతురు హారతి పళ్లెం తీసుకొని మిద్దెలోకి పోయింది.

నాంచారయ్య ఎడ్లు పూన్చి బండి కట్టుకొంటూ, గడ్డి తొలగిస్తూ కిరసనాయిలు కంపు వాసన పట్టాడు. ‘ఏమిటిది?’ అన్నట్లు చూశాడు.

“తెల్లవారుజామున బండిని తగలబెడదామనుకొన్నా,” లింగాలు భోరున ఏడ్చాడు.

నాంచారయ్య ఏడుపు ముఖం పెట్టాడు.

“కన్నబిడ్డను ఏ ప్రేమున్న తండ్రీ చంపుకో లేడు,” లింగాలు ఏడుస్తున్నాడు. లింగాలును వాటేసు కొని నాంచారయ్య బావురుమని ఏడ్చాడు. వాళ్ల ఏడ్పు... ఏడ్పు కాదు.... ప్రేమ!

*ఆదివారం ఆంధ్రప్రభ, 23 మార్చి 2008*

